సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 27 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 518 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



మరింత పెరిగిన టమాట ధర

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.132 పలికింది. కనిష్టం రూ.100, సరాసరి రూ.120 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
28.2°/21.4°

జిల్లాలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ



అనంతపురం టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు 'డయల్ యువర్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌ఈ సురేంద్ర తెలిపారు. వినియోగదారులు 08554-272943 నంబరుకు డయల్ చేసి విద్యుత్ సమస్యలను తెలిపితే పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బస్సులో బంగారు ఆభరణాల చోరీ

- హిందూపురం వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు



ఫిర్యాదు చేసేందుకు హిందూపురం వన్‌టౌన్ స్టేషన్‌కు వచ్చిన బాధితురాలు

మడకశిర/ హిందూపురం అర్బన్: హిందూపురం నుంచి మడకశిరకు వస్తున్న ఆర్టీసీ బస్సులో బుధవారం మధ్యాహ్నం 600 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు... మడకశిరకు చెందిన ఆదినారాయణ సతీమణి విజయలక్ష్మి పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గత శనివారం హిందూపురంలోని తన కుమార్తె సంధ్య ఇంటికి వెళ్లింది. బుధవారం కుమార్తె ఇంటి నుంచి మడకశిరకు బయలుదేరింది. దాదాపు 600 గ్రాముల బంగారు ఆభరణాలను ఒక బ్యాగులో ఉంచుకుని మధ్యాహ్నం హిందూపురంలోని పరిగి బస్టాండ్‌లో వచ్చి అక్కడ మడకశిర వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఇంటికి చేరుకున్న బాధితురాలు బంగారు ఆభరణాలున్న బ్యాగు చూసుకోగా ...కనిపించలేదు. మార్గంమధ్యలోనే బంగారు ఆభరణాల బ్యాగు చోరీ గురైనట్లు ఆమె తెలుసుకుంది. కుటుంబీకులతో కలిసి బుధవారం రాత్రి హిందూపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ కంజాక్షన్ బాధితురాలికితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పరిగి బస్టాండు వద్ద తన పక్కనే ఇద్దరు మహిళలు కూర్చుని వెంటనే వెళ్లిపోయారని ఫిర్యాదులో బాధితురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు.

నేడు 'విదేశీ విద్యా దీవెన' నగదు జమ



ప్రశాంతి నిలయం: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి సంబంధించిన నగదు గురువారం విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ కానుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. జిల్లాలో ముగ్గురు విద్యార్థులకు ఈ పథకం కింద కళాశాలల ఫీజులకు సంబంధించి రూ.2.25 కోట్లు మంజూరైంది. విదేశీ విద్యా దీవెన నగదు జమ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సాధికారిక అధికారి శివరంగప్రసాద్ తెలిపారు.

'ఓపెన్' ప్రవేశాలకు నోటిఫికేషన్



ప్రశాంతి నిలయం: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతి ప్రవేశాలకు, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్ చేరేందుకు అర్హులని జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు https:// apopenschool. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా అంతటా జడివాన




పుట్టపర్తిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా జడివాన కురిసింది. కొన్ని మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 30 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా హిందూపురం, గుడిబండ మండలాల్లో 13.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పరిగి, రొళ్ల మండలాల్లో 12.4 మి.మీ, మడకశిర 10.2 మి.మీ, రొద్దం 9.2 మి.మీ, సోమందేపల్లి 8.6 మి.మీ, గోరంట్ల 8.2 మి.మీ, అమరాపురం 7.6 మి.మీ, లేపాక్షి 7.4 మి.మీ, పెనుకొండ, చిలమత్తూరు 6.6 మి.మీ, అగళి 6 మి.మీ, ఎన్‌పీ కుంట 5.4 మి.మీ, గాండ్లపెంట, తనకల్లు, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో 4.4 మి.మీ మేర వర్షం కురిసింది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా కురిసిన వర్షాలతో చాలా మంది విత్తనం వేసేందుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 5వ తేదీ వరకు పంటల సాగుకు అనుకూల సమయమని ఇప్పటికే శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ నేపథ్యంలో తాజా వర్షాలతో జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



పెనుకొండలో వర్షం కురుస్తున్న దృశ్యం

పచ్చనేత.. తేల్చుకోలేక!



"ఏం లాభం లేదప్పా... ఎవరితో పొత్తు ఉంటుందో తెలియదు. సీటు పొత్తులో పోతుందా...ఇస్తే ఎవరికిస్తారో తెలియదు... ఇప్పటి నుంచే జనాల్లో తిరుగుతూ డబ్బు పెట్టుకుంటూ పోతే చివరకు గుండు సున్నా. ప్రస్తుతం పార్టీ పరిస్థితీ బాగోలేదు..జిల్లాలో చాలాచోట్ల సీట్లిచ్చినా గెలిచే పరిస్థితి లేదు... అందుకే ఇంటికే పరిమితమైన"

– టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుడితో ఓ నేత ఆవేదన ఇది.. జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో టీడీపీ నేతలది ఇదే పరిస్థితి.

- పొత్తు తేలదు.. విజయావకాశాల్లేవు
- నిరుత్సాహంలో టీడీపీ నేతలు
- చాలా మంది ఇళ్లకే పరిమితం
- ధర్మవరం, కదిరి, పుట్టపర్తిలో అయోమయం
- టీడీపీ తరఫున పోటీకి ముందుకు రాని వైనం

సాక్షి, పుట్టపర్తి: ఇన్నాళ్లూ టికెట్ కోసం పోటీ పడిన తెలుగు తమ్ముళ్లు... ప్రస్తుతం మౌన ముద్రలో ఉండిపోయారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పోటీ చేస్తే ఓటమి తప్పదని తెలుసుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. చివరకు నియోజకవర్గంలోని ప్రజలనూ కలవడం మానేశారు. దీనికి తోడు జనసేనతో పొత్తు కుదిరితే ఆ పార్టీ నేతలకు టికెట్ ఇస్తారేమోనన్న సందేహం ఓ వైపు వెంటాడుతోంది. ఫలితంగా కార్యకర్తల్లోనూ గందరగోళం నెలకొంది. ఎటు పోవాలి.. ఏ నాయకుడి వద్ద ఉంటే మంచి జరుగుతుందో తెలియక సందిగ్ధంలో పడిపోయారు.

ఇళ్లకే పరిమితమైన 'పచ్చ' నేతలు..

జనాలు వెంట రాకపోవడంతో జిల్లాలోని పలు నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జ్‌లు కూడా బయట తిరగడం మానేశారు. రెండు నెలలుగా కార్యకర్తల యోగ క్షేమాలను సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. కదిరిలో మైనార్టీలకు టికెట్ ఇస్తారని ఇన్‌చార్జ్‌గా ఉన్న కందికుంట వెంకట ప్రసాద్ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పుట్టపర్తిలో బీసీ సామాజికవర్గం లేదా కమ్మ కులానికి టికెట్ ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతుండటంతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నిరుత్సాహంలో ఉన్నారు. ధర్మవరం టికెట్ జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

పుట్టపర్తి బీసీలకేనా?

జిల్లా కేంద్రం పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఉన్నారు. అయితే ఆయనకు వ్యతిరేకంగా సొంత పార్టీలోనే గ్రూపు రాజకీయం నడుస్తోంది. దీంతో ఆయనకు బదులు బీసీ సామాజికి వర్గానికి చెందిన వారికి టికెట్ ఇస్తే ఎలాంటి సమస్యా ఉండదనే నిర్ణయం అధిష్టానం తీసుకుందని 'తమ్ముళ్లు' చెబుతున్నారు. దీంతో పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తిలో సొంత పనులకే పరిమితమయ్యారు. పల్లె వెంట తిరిగేందుకు 'తమ్ముళ్లు' కూడా వెనుకడుగు వేస్తున్నారు. బీసీ వర్గాలకు టికెట్ లేదంటే కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉంది.

ధర్మవరం సీటు జనసేనకేనంటూ ప్రచారం..

నాలుగేళ్లుగా పరిటాల శ్రీరామ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ తరపున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పరిటాల శ్రీరామ్ కూడా ఖర్చు తప్ప లాభం లేదని భావించి మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. వరదాపురం సూరి ఇప్పటికీ బీజేపీలోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో జనసేనతో పొత్తు పెట్టుకుని ఆ పార్టీ నేతకే టికెట్ ఇస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో టీడీపీలో చేరేందుకు వరదాపురం సూరి సంకోచిస్తున్నారు.

కదిరి మైనార్టీలకేనా?

కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా కందికుంట వెంకట ప్రసాద్ చాలా ఏళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే 2009 ఎన్నికల్లో మాత్రమే ఆయన విజయం సాధించారు. మూడుసార్లు ఓడిపోయారు. ఈసారి టికెట్ ఇచ్చినా... మరోసారి ఆయన ఓటమి ఖాయమని సర్వేలో తేలినట్లు తెలిసింది. ఫలితంగా ఆయన బదులు మైనార్టీలకు టికెట్ కేటాయించే ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కందికుంట వెంకట ప్రసాద్ సొంత పనులకే పరిమితమయ్యారని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాల్లో ఆయన కనిపించడం లేదు.

'యువగళం'తర్వాత గప్‌చుప్..

జిల్లాలో 'యువగళం' పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ వెంట నడిచేందుకు నాయకులు ఆసక్తి చూపారు. ఆ తర్వాత ఎలాంటి కార్యక్రమూ నిర్వహించలేదు. ఇటీవల నిర్వహించిన టీడీపీ బస్సు యాత్ర అట్టర్ ఫ్లాప్ కావడంతో నాయకులు నిరుత్సాహంలో పడ్డారు. కార్యకర్తలు కూడా వెంట రాకపోవడంతో పోటీ చేసేందుకు చాలా మంది విముఖత వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న జేసీ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష' కార్యక్రమంలో భాగంగా భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని జేసీ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... లక్ష్యం మేరకు రీసర్వే ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా జాయింట్ ఖాతా, వివాదాలు, ఆక్రమణలు, పొజిషన్ మార్పులతో ఇబ్బందులు తదితర సమస్యలు ఉంటాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులను నిర్ణీత కాలంలో పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం వన్‌టైం సెటిల్‌మెంట్, 90 రోజుల్లో ఇంటి పట్టాల పంపిణీ, ఏపీఐఐసీకి సంబంధించిన భూములు, నీటి పన్ను తదితర అంశాలపై సమీక్షించారు. తాడిమర్రి, కనగానపల్లి, కదిరి, మడకశిర, తనకల్లు, అమడగూరు, ముదిగుబ్బ, గోరంట్ల, పెనుకొండ తహసీల్దార్లు రెవెన్యూ అంశాల్లో వెనుకబడి ఉన్నారని, పురోగతి సాధించేలా పని చేయాలన్నారు. డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ... ఈనెల 28వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. కావాల్సినన్ని మొక్కలు అందుబాటులో ఉంచుతామన్నారు. సమావేశంలో ల్యాండ్ సర్వే ఏడీ రామకృష్ణ, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ అరుణ్‌బాబు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అధికారులు

పుట్టపర్తి అర్బన్: ధర్మవరం, హిందూపురం, మడకశిర మున్సిపాలిటీలకు 'అమృత్' పథకం కింద నిధులు మంజూరయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆయా మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కాలుష్య నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవనశైలి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణలో వివిధ వర్గాల ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. స్థానిక సంస్థలు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. చెత్త నుంచి ఆదాయం పొందడానికి అనువైన కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఉమ్మడి జిల్లాల కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్య, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'వాతావరణ మార్పు- ఆరోగ్య పరిష్కారాలు' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విషపూరిత వాయువులు వాతావరణంలో పరిమితికి మించి కలుస్తుండటంతో భూ మండలం వేడెక్కుతోందన్నారు. దీనిపై ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డీఏఓ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా రవాణాధికారి నిరంజన్‌రెడ్డి, భూగర్భ జల శాఖ అధికారి రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.


మల్బరీ రైతులకు రాయితీలు



రైతులకు సూచనలిస్తున్న సెరికల్చర్ ఆఫీసర్

పుట్టపర్తి అర్బన్: మల్బరీ రైతులకు ప్రభుత్వం ఎన్నో రాయితీలు అందిస్తోందని, సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సెరికల్చర్ ఏడీ నరసింహులు, ఆఫీసర్ సుమముక్త సూచించారు. బుధవారం పుట్టపర్తి మండలం పెడపల్లి రైతు భరోసా కేంద్రంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద డాక్టర్ వైఎస్సార్ పట్టుబడి రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా మల్బరీ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా మల్బరీ రైతులకు సబ్సిడీలు అందజేస్తోందన్నారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కలు పెంచేందుకు రూ.18,750 అందిస్తుందన్నారు. అలాగే 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో రేషం షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, షూట్ పరికరాలకు రూ.56,250 మంజూరు చేస్తోందన్నారు. మల్బరీ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ జావీద్, ఆర్బీకే సిబ్బంది నాగరమేష్, డింపుల్ చౌదరి, సర్పంచ్ మంగ్లీబాయి పాల్గొన్నారు.

తుంగభద్రకు పోటెత్తిన వరద



నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర డ్యాం

- 1,13,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 44.19 టీఎంసీలు దాటిన నీటి నిల్వ
- హెచ్చెల్సీ నీటి విడుదలకు మార్గం సుగమం

అనంతపురం సెంట్రల్: ఆలస్యమైనా వర్షాలు ఆయకట్టు రైతులను గట్టెక్కించాయి. తుంగభద్ర జలాశయానికి కనీవినీ ఎరుగని రీతిలో వరద వస్తోంది. అత్యధికంగా 1,13,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. బుధవారం సాయంత్రానికి జలాశయ నీటిమట్టం 44.19 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర హైలెవల్ కెనాల్(హెచ్చెల్సీ)కి నీటిని విడుదల చేయడానికి బోర్డు సుముఖత వ్యక్తం చేసింది. ఈ ఏడాది దామాషా ప్రకారం 175 టీఎంసీలు తుంగభద్ర జలాశయానికి నీటి లభ్యత ఉంటుందని అంచనా వేశారు. దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.828 టీఎంసీల కేటాయింపులు చేశారు. వర్షాభావంతో తుంగభద్ర జలాశయం అడుగంటడడంతో నీటి కేటాయింపులు తగ్గవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే గత కొద్దిరోజులుగా కర్ణాటకలో విస్తారమైన వర్షాలు కురుస్తున్నాయి. దీని వల్ల రోజుల వ్యవధిలోనే జలాశయం సగం దాకా నిండింది. మరికొద్దిరోజులు ఇలానే వరద వస్తే పూర్తి స్థాయిలో నిండే అవకాశముంది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు ఈ నెల 28న తుంగభద్ర జలాశయం వద్ద హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. తొలుత రోజుకు 500 క్యూసెక్కులు చొప్పున నీటిని తీసుకుంటూ క్రమంగా పెంచుకోవాలని భావిస్తున్నారు. ఈ నెల 30 నాటికి జిల్లా సరిహద్దులోకి తుంగభద్ర జలాలు వస్తాయని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ 'సాక్షి'కి తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు ఆగిన ఇన్‌ఫ్లో..

శ్రీశైలం జలాశయానికి బుధవారం ఇన్‌ఫ్లో ఆగిపోయింది. కొద్దిరోజులుగా జూరాల ప్రాజెక్టు నుంచి వరదనీటిని దిగువకు వదలడంతో కొంత వరకు శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పెరిగింది. అయితే బుధవారం జూరాల నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో శ్రీశైలానికి ఇన్‌ఫ్లో ఆగిపోయింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటి మట్టం 809 అడుగులకు చేరింది. 830 అడుగులకు చేరితేనే హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు లిఫ్టుల ద్వారా నీటిని తీసుకునే అవకాశముంటుంది. హంద్రీ-నీవాకు నీటి విడుదలకు మరికొద్దిరోజులు సమయం పట్టే అవకాశమున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు

నార్పల: గూగూడు ఉత్సవాల్లో బుధవారం కుళ్లాయిస్వామి చిన్నసరిగెత్తు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని అర్చకులు హుసేనప్ప ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు కుళ్లాయిస్వామి పీరుతో పాటు పక్కనే ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, ఈఓ శోభ, స్థానికులు లింగారెడ్డి, గోపాల్, శివయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కుళ్లాయిస్వామి



కుళ్లాయి స్వామి పీరు దర్శనం కోసం ఎదురు చూస్తున్న భక్తులు

క్లుప్తంగా

సేవాభారతి అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్రోద్యమ వేడుకలను పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో అందజేసే సేవాభారతి, తెలుగు తేజం జాతీయ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 13న హైదరాబాదులో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారు అర్హులు. సంబంధిత వివరాలతో దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ సామాజిక సేవా సంస్థ, డోర్ నం.1-20-103, తిరుమలగిరి పోస్టు, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామాకు ఆగస్టు 5వ తేదీ లోపు అందేలా పంపాలి. పూర్తి వివరాలకు 96523 47207లో సంప్రదించవచ్చు.

సజావుగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో భర్తీ చేయనున్న 63 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాలోని అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ బుధవారం సజావుగా సాగింది. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో చేపట్టిన ఈ ప్రక్రియను డీఆర్వో గాయత్రీదేవి నేతృత్వంలో ఉభయ జిల్లాల కలెక్టరేట్ పరిపాలనాధికారులు శ్రీధర్, వెంకటనారాయణ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. మండలానికి ఓ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు చొప్పున 63 మండలాలకు 63 పోస్టులకు 126 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. వీరందరికీ త్వరలో కంప్యూటర్ ప్రొఫెషనల్ టెస్ట్ ఉంటుందన్నారు.

కరువు సీమలో చదువుల సిరులు

రేపు ఎస్కేయూ ఆవిర్భావ దినోత్సవం

- హాజరు కానున్న ప్రముఖులు



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం

అనంతపురం: కరువు సీమలో కల్పతరువుగా భాసిల్లుతున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఏర్పడి నేటితో 41 సంవత్సరాలు పూర్తయింది. 42వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న వర్సిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీంతో క్యాంపస్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

ఎస్వీయూ పీజీ అధ్యయన కేంద్రంతో మొదలై..

అనంతపురం కేంద్రంగా 1967లో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా ఏర్పాటై 1976లో అటానమస్ పీజీ సెంటర్‌గా గుర్తింపు దక్కించుకుంది. 1981లో ఎస్కేయూనివర్సిటీగా రూపాంతరం చెందింది. జ్ఞానం (విద్య), కర్మలు (పనులు) రెండింటినీ కలిపి తెలుసుకున్నవాడు కర్మల ద్వారా మరణాన్ని దాటి, జ్ఞానం ద్వారా అమరత్వాన్ని పొందుతాడనే ఈశావాస్యోపనిషత్తులో పేర్కొన్న 11వ శ్లోకం లోని ముక్తాయింపు 'విద్యయామృత శ్నుతే'ను జోడించి వర్సిటీ లోగోను రూపొందించారు. 487 ఎకరాల సువిశాలమైన క్యాంపస్‌తో 1988 నాటికి పూర్తిస్థాయి వర్సిటీగా గుర్తింపు దక్కించుకుంది. ప్రస్తుతం క్యాంపస్‌లో 4,312 మంది విద్యార్థులతో పాటు రెండు అటానమస్ కళాశాలలున్నాయి. 112 అనుబంధ డిగ్రీ కళాశాలల్లో లక్ష మంది విద్యార్థులు డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 76 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, 11 బీఈడీ కళాశాలలు, 1 బీపీఈడీ, 1 లా కళాశాల, 10 ఎంబీఏ /ఎంసీఏ కళాశాలలు, 17 పీజీ కళాశాలలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 3,113 మంది డాక్టరేట్ అవార్డులు అందుకున్నారు. 8 వేల అంతర్జాతీయ జర్నల్స్ ముద్రించారు. రూ.50 కోట్ల విలువైన ఇస్రో, డీఎస్‌టీ, డీబీటీ, యూజీసీ, నీతి అయోగ్ ప్రాజెక్టులు నిర్వహించారు. బోటనీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అండ్ పాలిమర్‌సైన్సెస్ విభాగాల్లో గణనీయమైన పరిశోధనలు జరిగాయి.

అంచలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి..

వర్సిటీలో ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్ కళాశాలలతో పాటు, ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఈడీ కళాశాలలున్నాయి. ఎస్వీయూ పీజీ సెంటర్‌గా ఉన్నప్పుడే ఇంగ్లిష్, తెలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, జువాలజీ, కామర్స్, లా, ఎకనామిక్స్, రూరల్‌డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహించారు. 1981లో ఇన్‌స్ట్రుమెంటేషన్, పాలిమర్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, హిస్టరీ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చారు. 1982లో లైబ్రరీ సైన్సెస్, 1984లో పొలిటికల్ సైన్సెస్, జియాగ్రఫీ, 1985లో బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బోటనీ, సోషియాలజీ, అడల్ట్ ఎడ్యుకేషన్, 1986లో ఎంబీఏ, 1991లో ఎంపీఈడీ, 1994లో కంప్యూటర్ సైన్సెస్, 1998లో బయోటెక్నాలజీ, 2006లో ఇంజినీరింగ్ కళాశాల, 2007లో ఎడ్యుకేషన్ కళాశాల, 2008లో ఫార్మసీ కళాశాల, 2013లో హిందీ విభాగాలను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్‌లో 13 విభాగాల్లో 18 పీజీ కోర్సులు, సైన్సెస్‌లో 16 విభాగాల్లో 19 పీజీ కోర్సులు, ఇస్రో ప్రాజెక్ట్, బొటానికల్ గార్డెన్, సైన్సెస్‌లో విదేశాల్లో పీడీఎఫ్‌లు, పటిష్టమైన, నాణ్యమైన పరిశోధనలు, దక్షిణ భారతదేశంలోనే తొలి అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుతో ఎస్కేయూ జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకుంది. ఇస్రో ఆధ్వర్యంలో ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ఏర్పాటుతో అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి గుర్తింపు దక్కింది.

హాజరు కానున్న ప్రముఖులు..

ఈ నెల 28న నిర్వహించబోయే వర్సిటీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి, విశిష్ట అతిథులుగా యూపీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ వి.పద్మనాభరెడ్డి, జేఎన్‌టీయూ(ఏ)వీసీ జింకా రంగజనార్ధన, రాయలసీమ వర్సిటీ వీసీ ఎ.ఆనందరావు, యోగివేమన వర్సిటీ వీసీ సి.సుధాకర్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి హాజరుకానున్నారు. కార్యక్రమానికి ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ డే కార్యక్రమానికి అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సాయంత్రం 5:30 గంటలకు ఆడిటోరియంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

నైపర్ జేఈఈలో సత్తా చాటిన ఓటీపీఆర్ఐ విద్యార్థులు



కె.ప్రత్యూష   జి.శివరంజని   కె.జోషిత

అనంతపురం: ఫార్మా కోర్సుల్లో పీజీ ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్-2023 (నైపర్ జేఈఈ-2023)లో జేఎన్‌టీయూ(ఏ) ఓటీపీఆర్ఐ విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన వారిలో 249వ ర్యాంక్‌తో కె.ప్రత్యూష, 795 ర్యాంక్‌తో జి.శివరంజని, 890 ర్యాంక్‌తో కె.జోషిత తొలి మూడు స్థానాలు దక్కించుకున్నారు. అలాగే జి.లింగేశ్వ (1,600), జి.సుకన్య (2,300), ఎస్.బ్లెస్సీ (2,997), ఎం.శిరీష (3,283), కె.శ్వేతాబాయి (3,647) ర్యాంకులు దక్కించుకున్నారు. దీంతో వీరు మొహాలీ, హైదరాబాద్, గౌహతి, కోల్‌కతా, రాయ్‌బరేలీ, హాజీపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో పీజీ చేయడానికి మార్గం సుగమమైంది. ఫార్మాసుటిక్స్, ఫార్మా సూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఫార్మాసుటికల్ అనాలసిస్, రెగ్యులేటరీ అఫైర్స్, క్లినికల్ రీసెర్చ్ తదితర విభాగాల్లో ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. జాతీయ స్థాయిలో గణనీయమైన ప్రతిభ చాటిన విద్యార్థులను ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



వికాస్ మృతదేహం

పెనుకొండ: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమ నేషనల్ ఆటో ప్లాస్ట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వికాస్ (27) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఇతను కొంతకాలంగా పెనుకొండలోని అల్విన్ కాలనీలో సోదరుడు రాజు, మరి కొందరు కార్మికులతో కలసి అద్దె ఇంట్లో ఉంటూ నేషనల్ ఆటో ప్లాస్ట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తన గదిలో గొంతు కోసిన స్థితిలో పడి ఉన్నాడు. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని తోటి కార్మికులు గమనించి.. చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేశారు. ఈ మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది, తోటి కార్మికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేదంటే ఇతరత్రా ఏవైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నామని చెప్పారు.

కుక్కను కొట్టాడని వ్యక్తిపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుక్కను కొట్టాడని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫస్ట్‌రోడ్డులో నివాసముంటున్న సురేష్ ఇంటికి బుధవారం ఆయన సోదరుడు వచ్చాడు. ఆ సమయంలో ఇంటి పక్కన నివాసముంటున్న వ్యక్తి పెంపుడు కుక్క ఆయనను కరిచింది. దీంతో ఆ కుక్కను బాధితుడు కొట్టాడు. ఈ విషయాన్ని గమనించిన కుక్క యజమాని అతనిపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన సురేష్‌పై సైతం దాడికి ప్రయత్నించడంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చెలరేగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనపై ఇరు వర్గాలూ ఫిర్యాదు చేయడంతో చాలా సేపు మూడో పట్టణ పోలీసులు సర్దిచెప్పారు. అయినా కుక్క యజమాని తన పంథాను మార్చుకోకపోవడంతో చివరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

యువకుడి అనుమానాస్పద మృతి



ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: మండలంలోని ఇందుకూరుకు చెందిన ప్రతాప్‌రెడ్డి (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. 15 రోజుల క్రితం గొడవపడడంతో మనస్తాపం చెందిన తల్లి తల్లి వెంకటలక్ష్మమ్మ, చెల్లి బంధువుల ఊరికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రతాప్‌రెడ్డి విపరీతంగా మద్యం తాగడం మొదలు పెట్టాడు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు పులివెందుల నుంచి వచ్చిన స్నేహితుడితో కలసి రోజంతా మద్యం తాగాడు. బుధవారం ఉదయం ఎంతసేపటికీ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పక్కింటి వారు 8 గంటలకు తలుపులు తోసి చూశారు. లోపల ప్రతాప్ రెడ్డి విగతజీవిగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనాస్థలాన్ని ఎస్ఐ హేమంత్‌కుమార్ పరిశీలించారు. మృతదేహంపై గాయాలు ఉన్నాయి. క్లూస్‌టీంను రంగంలో దించి వేలిముద్రలు సేకరించారు. మృతుడి కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఖాతాల్లోకి 'పీఎం కిసాన్' నగదు

- 2.87 లక్షల మందికి రూ.57.50 కోట్లు



అనంతపురం అగ్రికల్చర్: 'వైఎస్సార్ రైతు భరోసా'లో భాగంగా పీఎం కిసాన్ కింద మొదటి విడతగా రూ.2 వేల ప్రకారం పెట్టుబడి సాయం గురువారం రైతుల ఖాతాల్లోకి జమ కానుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ పథకం కింద ఏటా ప్రతి రైతు కుటుంబానికీ రూ.13,500 సాయం అందుతోంది. ఖరీఫ్ పెట్టుబడికి జూన్‌లో రూ.7500 ప్రకారం, రబీ పెట్టుబడికి అక్టోబర్‌లో రూ.4 వేలు, పంట నూర్పిడి సమయంలో సంక్రాంతి కానుకగా మూడో విడతగా రూ.2 వేలు ప్రకారం గత నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లోకి జమ అవుతోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, కేంద్రం రూ.6 వేలు ఇస్తోంది. అయితే కౌలుదారులు, అటవీభూముల సాగుదారులకు పూర్తి మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ క్రమంలో ఐదో ఏడాదికి సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా కింద జూన్ ఒకటిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతుకూ రూ.5,500 ప్రకారం జమ చేశారు. 2.87 లక్షల మందికి పైగా రైతులకు రూ.159 కోట్లు ఇచ్చారు. అయితే ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో పీఎం కిసాన్ కింద కేంద్రం వాటా రూ.2 వేలు కాస్త ఆలస్యమైంది. ఆ మొత్తాన్ని గురువారం విడుదల చేస్తున్నారు. పీఎం కిసాన్ కింద ఇపుడు 2.87 లక్షల మందికి పైగా రైతులకు రూ.57.50 కోట్ల వరకు పెట్టుబడిసాయం జమ కానుందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ పథకం కింద గత నాలుగేళ్లలో జిల్లా రైతులకు రూ.1,660 కోట్ల మేర ఇచ్చారు. ఇపుడు ఐదో ఏడాది కూడా దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.

సహజీవనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెళ్లి కాలేదని ఓ మహిళను మోసగించి పదేళ్లు సహజీవనం చేసిన వ్యక్తిపై అనంతపురం టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ శివరాముడు తెలిపిన మేరకు.. నగరంలోని ఓ కాలనీకి చెందిన జయమ్మ నర్స్‌గా పని చేస్తోంది. పదేళ్లుగా విజయ భాస్కర్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇటీవల విజయభాస్కర్‌కు పెళ్లి అయిందనే విషయం తెలుసుకున్న జయమ్మ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు

హిందూపురం: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ బుధవారం ముగిసింది. స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియను అధ్యక్షుడు కె.రమేష్ పర్యవేక్షించారు. పరిశీలకులుగా ఎంపీడీఓ నరేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు హాజరయ్యారు. జూనియర్ విభాగంలో మహమ్మద్ జైహిద్‌ఖాన్, మహమ్మద్ అమీన్, మహమ్మద్ సాజిద్, షేక్‌యాహిజ్, అనాష్, నిజాముద్దీన్ ఎంపికయ్యారు. అలాగే అండర్ 12 విభాగంలో అర్షాద్, సాయివిఘ్నేష్, షేక్ అర్జున్, ధనుంజయ, అబ్దుల్ ఖాదర్, అండర్ 13 విభాగంలో ప్రణవ్, షాజిద్ రహమాన్, శ్రీచరణ్, శోభన్, చందన్, అండర్ 14 విభాగంలో అస్లామ్, ఎం.అర్షాద్, నేహ, అండర్ 15 విభాగంలో సయ్యద్ ఎంపికయ్యారు.

సిలిండర్ పేలుడు ఘటనపై విచారణ

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండా (రూపానాయక్ తండా)లో నివాసముంటున్న ఆర్‌వీ సరోజమ్మ ఇంట్లో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న వంట గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై తహసీల్దార్ అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ నేరుగా సరోజమ్మ ఇంటికి చేరుకున్నారు. పేలుడులో పూర్తిగా నేలమట్టమైన ఇంటిని పరిశీలించారు. నష్టం అంచనాలు రూపొందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచ్ శివాజీ నాయక్ మాట్లాడుతూ.. రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వివరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు చూపుతున్న సెబ్ అధికారులు

రాయదుర్గం: అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు... అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సెబ్ ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది బుధవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో రాయదుర్గం మండలం గ్రామదట్ల వద్ద 576 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తూ కె.గంగాధర్ పట్టుబడ్డాడన్నారు. అలాగే గుమ్మఘట్ట సమీపంలో సెబ్ పోలీసులను చూడగానే ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని వదిలేసి పారిపోయాడన్నారు. పరిశీలించగా 192 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం బయటపడిందన్నారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

బాలిక అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ లింగన్న

పుట్టపర్తి టౌన్: ఏడు రోజుల క్రితం తప్పిపోయిన బాలికను తల్లిదండ్రుల వద్దకు పోలీసులు సురక్షితంగా చేర్చారు. వివరాలను కొత్తచెరువు ఎస్ఐ లింగన్న వెల్లడించారు. పుట్టపర్తి మండలం కంబాలపర్తికి చెందిన శ్రీనివాసులు కుమార్తె ప్రియదర్శిని అనంతపురంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇటీవల సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక ఈ నెల 19న కళాశాలకు తిరుగు ప్రయాణమైంది. తండ్రితో కలసి బస్సులో కొత్తచెరువుకు చేరుకున్న తర్వాత పక్కనే ఉన్న షాపులో తండ్రి మందులు కొనుగోలు చేసుకుని వచ్చే లోపు కనిపించకుండా పోయింది. ఘటనపై శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం బాలిక ఆచూకీని పసిగట్టి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం బుధవారం ఉదయం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

జింక మృతి



మడకశిర రూరల్: మండలంలోని క్యాంపురం వద్ద పొలాల్లో ఓ జింక మృతి చెందింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు జింక కళేబరాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రెండు, మూడు జింకల పోట్లాడుకోవడంతో 14 నెలల వయసున్న ఓ ఆడ జింక మృతి చెందినట్లుగా అధికారులు నిర్ధారించారు. జింక కళేబరాన్ని మడకశిరలోని పశువైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అటవీ శాఖ కార్యాలయంలో దహనం చేశారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణయ్య

నల్లమాడ: గర్భిణులు, చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు తప్పనిసరిగా అందించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య సూచించారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లిలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. మీసాలపల్లిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను పరిశీలించారు. ఆగస్టులో ప్రభుత్వం చేపట్టనున్న మిషన్ ఇంద్రధనస్సుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, డాక్టర్ దీప్తిరెడ్డి, సీహెచ్‌ఓ రామాంజులు, సూపర్‌వైజర్లు మహబూబ్‌బాషా, మంజుల, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెయ్య దూడలతోనే పాడిపరిశ్రమ అభివృద్ధి



చూడి పశువులను ప్రదర్శిస్తున్న పశు గణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

రాప్తాడు: పెయ్య దూడలతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లిలో పెయ్య దూడల గర్భంతో ఉన్న చూడి ఆవుల ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. అత్యధిక పాడి సాధించడం ద్వారా రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు. ఇందు కోసం కేవలం పెయ్య దూడలే జన్మించేలా ఆధునికత సాంకేతికతతో 23 ఆవులకు కృత్రిమ గర్భధారణ చేయగా... ఇందులో 15 ఆవులకు కట్టు నిలిచిందన్నారు. సబ్సిడీతో ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు వినోద్, సోమేశ్వరి, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అటెండర్ ఆకస్మిక మృతి

అనంతపురం క్రైం: అనంతపురం నగరపాలక సంస్థలోని మెప్మా విభాగంలో అటెండర్‌గా (ఔట్‌సోర్సింగ్) విధులు నిర్వర్తించే దస్తగిరి(45) ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందాడు. బుధవారం ఉదయం విధులకు హాజరైన ఆయన కార్యాలయ సమీపంలోని ఓ కొట్టులో టీ తాగి వస్తుండగా కేఎస్ఆర్ స్కూల్‌కు ఆనుకుని గేటు వద్ద నేలకొరిగాడు. గమనించిన స్థానికులు ఆయనను పైకి లేపే లోపు నోటి నుంచి రక్తం కక్కుతూ ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, డీసీ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్‌ఓ సతీష్ తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై స్థానికులతో ఆరా తీశారు. సమాచారం అందుకున్న భార్య రమీజ, తల్లి ఖాసీం బీ అక్కడకు చేరుకుని బోరున విలపించారు. మృతుడికి ఓ కుమార్తె ఉంది. కాగా, దస్తగిరి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.